క్లుప్తంగా

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి



మాట్లాడుతున్న వేణు

సిరిసిల్లటౌన్‌: మణిపూర్‌ రాష్ట్రంలో సాగుతున్న మారణకాండను నిలువరించి అక్కడ శాంతిని నెలకొల్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్‌ చేశారు. ఆదివారం సిరిసిల్ల కార్మిక భవనంలో జరిగిన పార్టీ పట్టణ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. మణిపూర్‌లో బీజేపీ పాలనలో ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అక్కడి ప్రజల హక్కులకు భంగం వాటిల్లకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అక్కడి రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, కేంద్ర సర్కార్‌పై ఉందన్నారు. ఈమేరకు ఈనెల 25న సిరిసిల్ల పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రకటించారు. సమావేశంలో నాయకులు పంతం రవి, మంచికట్ల రమేశ్‌, సోమ నాగరాజు, వడ్డేపల్లి లక్ష్మణ్‌, నాగరాజు పాల్గొన్నారు.

సామాజిక సేవలో సంతృప్తి



జయవర్ధన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

సిరిసిల్లకల్చరల్‌: సామాజిక సేవలు అందించడంలో మానసిక ఆనందం లభిస్తుందని సిరిసిల్ల సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్‌ జనపాల శంకరయ్య అన్నారు. తెలంగాణ వివేక రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలు సేవా కార్యక్రమాలను నిస్వార్థంగా నిర్వహిస్తున్న తెలంగాణ గ్రాడ్యుయేట్ల సంఘం అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్‌ వ్యక్తిత్వాన్ని ప్రశంసించారు. అనంతరం ఆయనను శాలువా, ప్రశంసాపత్రంతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్‌ వాసరవేని పరశురాం, కనపర్తి జగదీశ్వర్‌, జనపాల ఉమామహేశ్వర్‌ పాల్గొన్నారు.

రూ.102.90 కోట్లతో ఆక్వాహబ్‌

• ట్వీట్‌ చేసిన ఎన్‌టీ కంపెనీ



కంపెనీ చేసిన ట్వీట్‌

తంగళ్లపల్లి: మండలంలోని చీర్లవంచ, చింతలఠాణా గ్రామాల శివారులో రూ.102.90 కోట్లతో 365 ఎకరాల విస్తీర్ణంలో ఆక్వా హబ్‌ ఏర్పాటు చేయబోతున్నట్లు ఎన్‌టీ కంపెనీ ట్వీట్‌ చేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో 5 వేల మందికి, నిర్మాణం పూర్తయ్యాక 17,300 మందికి ఉపాధి కల్పించనున్నట్లు ట్వీట్‌లో పేర్కొంది.

అలరించిన చిన్నారుల నృత్యం



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు



ప్రసంగిస్తున్న వేణుగోపాలచార్య కౌశిక

ఎల్లారెడ్డిపేట: స్థానిక సత్సంగ సదనంలో అధిక శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం శ్రీబాలత్రిపురసుందరి కూచిపూడి నాట్యాలయ శిష్యులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. సిరిసిల్ల, వేములవాడకు చెందిన శ్రీభోగ వసంత ధర్మరాజు శిష్యులు ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. జగిత్యాలకు చెందిన శ్రీనంభి వేణుగోపాలాచార్య కౌశిక ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో పయనించాలన్నారు. సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, భోగ వసంత ధర్మారాజు, చిన్నారులు పాల్గొన్నారు.

దళితులకు రక్షణ కరువు

• దళితులపై దాడి చేసిన ఎస్సైని శిక్షించాలి
• సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్‌



మాట్లాడుతున్న మూశం రమేశ్‌

సిరిసిల్లటౌన్‌: అధికార బీఆర్‌ఎస్‌కు చెందిన దళిత ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే దళితులకు రక్షణ లేకుండా పోయిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్‌ విమర్శించారు. సిరిసిల్లలోని పార్టీ కార్యాయంలో ఆదివారం ప్రెస్‌మీట్లో మాట్లాడారు. ఇల్లంతకుంట మండలం పొత్తూరులో ఇద్దరు దళిత యువకులపై అక్కడి ఎస్సై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడిన అధికారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలోనూ ఇల్లంతకుంట మండలంలో దళితులపై జరిగిన ఘటనలను గుర్తుచేశారు. బాధిత యువకులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. నాయకులు కోడం రమణ, శ్రీరాం సదానందం, సూరం పద్మ, దేవదాసు, లక్ష్మణ్‌, తిరుపతి, పోచమల్లు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



చందుర్తిలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్‌ తుల ఉమ



వేములవాడ: కార్మికులతో గుండా థామస్‌

ఎల్లారెడ్డిపేట/వేములవాడ/చందుర్తి/వీర్నపల్లి: గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా అధ్యక్షుడు ఎనుగంటి ఎల్లారెడ్డి డిమాండ్‌ చేశారు. నిరవధిక సమ్మె ఆదివారం 18వ రోజుకు చేరుకుంది. కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకూ అండగా ఉంటామన్నారు. పాలకులు కార్మికుల సేవలను గుర్తించడం లేదన్నారు. 18 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చందుర్తిలో ఉమ్మడి కరీంనగర్‌ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్‌ తుల ఉమ, వేములవాడ పట్టణంలో ఎమ్మార్పీఎస్‌ నాయకులు గుండా థామస్‌ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమాల్లో సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు రేసు రాజయ్య, మండల అధ్యక్షుడు జక్కుల మహేందర్‌, గ్రామ పంచాయితీ కార్మికుల సంఘం వీర్నపల్లి మండల అధ్యక్షుడు లద్దూరి దేవయ్య చందుర్తి మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గంభీరావుపేట: మండలం ముస్తాఫానగర్‌కు చెందిన దివ్యాంగులు సీఎం కేసీఆర్‌ చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. రూ.4 వేల పింఛన్‌ పెంచుతూ సీఎం కేసీఆర్‌ ఉత్తర్వులు జారీ చేయడాన్ని వారు హర్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్బర్‌, బండ రమేశ్‌, శివయ్య పాల్గొన్నారు.

హర్షం

ముస్తాబాద్‌: దివ్యాంగుల పింఛన్‌ పెంపుదలపై ముస్తాబాద్‌ సింగిల్‌విండో చైర్మన్‌ అన్నం రాజేందర్‌ రెడ్డి హర్షం ప్రకటించారు. దివ్యాంగుల కోసం సీఎం కేసీఆర్‌ గొప్ప మనసుతో రూ.3 వేలు ఉన్న పెన్షన్‌ను రూ.4 వేలు చేశాడన్నారు. బడుగు, బలహీనవర్గాల ప్రజల కోసం బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను బీఆర్‌ఎస్‌ శ్రేణులు ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ సుమతి, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

స్పందించారు.. రోడ్డుపై నీటిని తొలగించారు

• ఎంపీటీసీ భర్తను అభినందించిన గ్రామస్తులు



జేసీబీతో నీటిని తొలగింపజేస్తున్న మజీద్‌

ఎల్లారెడ్డిపేట: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ప్రధాన రహదారిపై వరదనీరు నిలిచి ప్రమాదాలు జరుగుతుండగా.. స్పందించిన ఎంపీటీసీ అపెరా సుల్తాన భర్త మజీదు సొంత ఖర్చులతో జేసీబీని తీసుకొచ్చి నీటిని తొలగింపజేశారు. ఎల్లారెడ్డిపేట నుంచి నారాయణపూర్‌కు వెళ్లే రహదారిపై వరద నీటితోపాటు పొలాల నుంచి నీరు రోడ్డుపైకి చేరుతుంది. ఆ నీరు కింది ప్రాంతానికి వెళ్లేందుకు వీలు లేకుండా డివైడర్‌ ఉండడంతో అక్కడి నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. దీంతో వాహనదారులు ఒకే వైపు నుంచి వస్తూ.. పోతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితిని గుర్తించిన మజీద్‌ జేసీబీ సహాయంతో డివైడర్‌ను కొంత వరకు తొలగింపజేసి నీటిని వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

పుచ్చకాయపై మంత్రి కేటీఆర్‌ చిత్రం



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటకు చెందిన కార్వింగ్‌ కళాకారుడు శామంతుల అనిల్‌కుమార్‌ మంత్రి కేటీఆర్‌ జన్మదినాన్ని పురస్కరించుకొని పుచ్చకాయపై ఆయన ముఖచిత్రాన్ని చెక్కారు. మంత్రి కేటీఆర్‌ జన్మదినం సోమవారం ఉండగా.. అనిల్‌కుమార్‌ 20 నిమిషాల వ్యవధిలో పుచ్చకాయపై మంత్రి ముఖచిత్రాన్ని చెక్కి తన అభిమానాన్ని చాటుకున్నాడు.



'అపూర్వ' సమ్మేళనం

సిరిసిల్లటౌన్‌: రెండుదశాబ్దాల తర్వాత పూర్వవిద్యార్థులు తాము చదివిన పాఠశాలలో మళ్లీ కలుసుకున్నారు. వివిధ హోదాల్లో స్థిరపడిన నాటి చిన్ననాటి స్నేహితులు తాము చదివిన పాఠశాలలో ఆడి..పాడి సేదతీరారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సిరిసిల్ల సుభాష్‌నగర్‌ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 2001–02లో చదివిన ఎస్సెస్సీ బ్యాచ్‌ పూర్వవిద్యార్థులు ఆదివారం తమకు చదువునేర్పిన గురుదేవులకు పూజ చేశారు. జీవితంలో స్థిరపడ్డాక చాలా ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులను కలిసి తమ మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. నాటి ఉపాధ్యాయులు మచ్చ ఆనంద్‌, బింగి రాజశేఖర్‌, బూర సుభాష్‌, గాలిపెల్లి కృష్ణహరి, జ్యోతిరాణి, సువర్ణ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవయ్య మరణం బాధాకరం



దేవయ్య మృతదేహం వద్ద నాయకులు

వీర్నపల్లి: సీఐటీయూ వీర్నపల్లి మండల అధ్యక్షుడు మ్యాకల దేవయ్య(58) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహంపై సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, ఎంపీటీసీ అరుణ్‌కుమార్‌ పార్టీ జెండా కప్పి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 35 ఏళ్లుగా హమాలీ కార్మికుడిగా పనిచేసిన దేవయ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారన్నారు. దేవయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సెస్‌ డైరెక్టర్‌ మల్లేశం, సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజయ్య, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్‌, నాయకులు పాల్గొన్నారు.

నియామకం

రజక సంఘం సిరిసిల్ల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌



దండు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్‌

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణ రజక సంఘం అధ్యక్షుడిగా దండు శ్రీనివాస్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిరిసిల్ల మానేరు తీరంలోని మడేలేశ్వర ఆలయ సన్నిధిలో రజక సంఘం సమావేశం జరిగింది. అధ్యక్షుడిగా దండు శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శిగా కాసర్ల మహేందర్‌, ఉపాధ్యక్షులుగా మారుపాక పెద్దశ్రీనివాస్‌, కాసర్ల శ్రీనివాస్‌, సహాయ కార్యదర్శిగా చెప్యాల మధుసూదన్‌, కోశాధికారిగా బండి శ్రీనివాస్‌, ప్రచార కార్యదర్శిగా కాసర్ల శ్రీనివాస్‌, కార్యవర్గ సభ్యులుగా కాసర్ల కిషన్‌, కొయ్యడ శ్రీశైలం, బండి సుమన్‌, చెప్యాల మహేశ్‌, బండి శ్రీధర్‌, మారుపాక అంజయ్య ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్‌ సన్మానించారు. రజక సంఘం నాయకులు దండు ఎల్లయ్య, బాలరాజు, లచ్చయ్య, బాలయ్య, శ్రీనివాస్‌, భాస్కర్‌, మహేశ్‌కుమార్‌, శ్రీధర్‌, విక్రమ్‌ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి

వేములవాడరూరల్‌: వేములవాడ మండలంలో ఉపాధి హామీ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు 2023–24 సంవత్సరానికి గాను పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు ఎకరాల్లోపు ఉన్న పట్టాదారులు మొత్తం కుటుంబసభ్యులు కలిపి ఉపాధి జాబ్‌కార్డు కలిగిన వారు బోరు బావి కలిగి, కరెంట్‌ సౌకర్యం ఉన్నవారికి ప్రభుత్వం ఈ అవకాశం ఇచ్చిందని ఆయన తెలిపారు. రైతు దరఖాస్తు పాస్‌బుక్‌, బ్యాంక్‌ అకౌంట్‌, ఆధార్‌కార్డ్‌, ఉపాధి జాబ్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్‌ ఫోటోతో పాటు గ్రామ పంచాయతీ తీర్మానంతో పంచాయతీ కార్యదర్శికి లేదా, ఏపీవో, ఈజీఎస్‌ వారికి అందజేయాలని తెలిపారు. ఇందులో 12 రకాల పండ్ల తోటలు పెట్టుకోవచ్చని సూచించారు. ఈ నెల 30లోపు లబ్ధిదారులు దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు.

ఆపరేషన్‌ జ్వాలపై సీఐతో చర్చ



సీఐకి బొకే ఇస్తున్న టీపీటీఎఫ్‌ నాయకులు

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల టౌన్‌ సీఐగా బాధ్యతలు స్వీకరించిన బి. ఉపేందర్‌ను టీపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు డొర్నల భూపాల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మైలారం తిరుపతి మర్యాదపూర్వకంగా కలిశారు. తాము ఉపాధ్యాయులు సమస్యలపై చేసే వివిధ ఉద్యమాలకు సహకరించాలని కోరారు. పట్టణంలోని పాఠశాలలో ఆపరేషన్‌ జ్వాల కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేయాలని కోరారు. దీనితో వారిలో ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. అనంతరం సీఐకి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

కేంద్ర మంత్రిని కలిసిన మాజీ జెడ్పీటీసీ



ముస్తాబాద్‌: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఆదివారం కలిసి పలు సమస్యలపై ఫిర్యాదు చేసినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చర్చించామన్నారు. ప్రజల్లో ప్రధాని మోదీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్‌ ఆరోపణలు చేస్తోందన్నారు. మండల అభివృద్ధిపై నివేదిక ఇచ్చినట్లు తెలిపారు.

విషజ్వరంతో యువకుడి మృతి

• కట్టలింగంపేటలో విషాదం



చందుర్తి: జీవనోపాధి కోసం గల్ఫ్‌ దేశంలో వెళ్లి ఇటీవల ఇంటికొచ్చిన యువకుడు విషజ్వరంతో మృతిచెందగా.. కట్టలింగంపేటలో విషాదం నెలకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మండలంలోని కట్టలింగంపేటకు చెందిన గుడిపెల్లి సతీశ్‌(36) నెల రోజుల క్రితం దుబాయి నుంచి స్వగ్రామానికి వచ్చాడు. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. మూడు రోజుల కిత్రం వేములవాడలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు చేసి పరిస్థితి విషమంగా ఉందని కరీంనగర్‌ పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతునికి భార్య వనిత, కుమారుడు జశ్వంత్‌, కూతురు అక్షయ ఉన్నారు.

వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల బాధ్యత



చేపూరి జనార్దన్‌ సత్కరిస్తున్న సీనియర్‌ సిటీజన్లు

సిరిసిల్లకల్చరల్‌: వయోవృద్ధులైన తల్లిదండ్రులను సంరక్షించే బాధ్యత పిల్లలదే అని ఆల్‌ సీనియర్‌ సిటీజన్ల సంఘం అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య అన్నారు. జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా ఆదివారం వైశ్యభవన్‌లో సంఘం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దైవ సమానంగా భావించాల్సిన తల్లిదండ్రులను అవసాన దశలో నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. సంఘం కార్యదర్శి జనపాల శంకరయ్య మాట్లాడుతూ పిల్లల నిర్లక్ష్యానికి గురవుతున్న వృద్ధులు ఎవరైనా తమను సంప్రదిస్తే కౌన్సెలింగ్‌ చేపడతామన్నారు. సమస్య తీవ్రంగా ఉంటే ఆర్డీవో కార్యాలయంలో కేసు నమోదు చేయించి చట్టపరమైన రక్షణ కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం సీనియర్‌ సిటీజన్‌ చేపూరి జనార్దన్‌ను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, దొంత దేవదాస్‌, అంకారపు జ్ఞానోభ, ఆనందం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్‌: ముస్తాబాద్‌లో ఆదివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ, పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం ఎలాంటి అనుమతులు లేకుండానే ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

విశ్వరూపం మహాసభను తరలిరండి

సిరిసిల్లఅర్బన్‌: హైదరాబాద్‌లో ఈ నెల 27న జరిగే మాదిగల విశ్వరూపం మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్‌ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ హక్కులు సాధించుకోవడం బాధ్యతని అన్నారు. ఎస్సీ వర్గీకరణలో అంతిమ పోరాటంలో భాగంగా మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే సభకు జిల్లాలోని మాదిగ ఉపకులాలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సమస్యలు పట్టించుకోని స్థానిక ప్రతినిధులు

బోయినపల్లి: మండలంలోని ప్రజా సమస్యలను స్థానిక ఎమ్మెల్యే, ఎంపీపీ, జెడ్పీటీసీ పట్టించుకోవడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో లోలెవల్‌ వంతెనలతో ప్రతీ ఏడు వర్షాకాలంలో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, అలాగే ఏళ్లు గడిచినా డబుల్‌ బెడ్రూం ఇళ్లు నిర్మించకపోవడంతో లబ్ధిదారులు పడుతున్న బాధలను పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

వైద్యశిబిరానికి స్పందన

కోనరావుపేట: ధర్మారంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరానికి స్పందన లభించింది. గ్రామంలో సిరిసిల్లకు చెందిన హిమాన్షి పిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో పిల్లల వైద్య నిపుణురాలు సీలిమ పరీక్షలు చేసి చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్‌ గున్నాల అరుణ, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

హరితహారంలో పూలమొక్కలు పంపిణీ

చందుర్తి: చందుర్తిలోని మహిళలకు హరితహారంలో భాగంగా సర్పంచ్‌ సిరికొండ ప్రేమలత ఆదివారం పూలమొక్కలు పంపిణీ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బుగ్గరాజేశ్వర తండాలో ఆదివారం లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను సర్పంచ్‌ రజిత పంపిణీ చేశారు.

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన కులేరు దేవరాజవ్వకు రూ.12 వేలు, సాసాల లక్ష్మికి రూ.12 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను ఉపసర్పంచ్‌ ఎల్లాల రాంరెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, సత్తిరెడ్డి అందజేశారు.

మత్స్యశాఖ చీఫ్‌ ప్రమోటర్‌కు సన్మానం

ఇల్లంతకుంట: మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన చొప్పరి రామచంద్రం జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం చీఫ్‌ ప్రమోటర్‌గా ఎన్నికైన సందర్భంగా ఫోరం ఫర్‌ బెటర్‌ ఇల్లంతకుంట స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆదివారం రామచంద్రంను శాలువాతో సన్మానించారు.

మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు

వేములవాడ: వేములవాడ టెంపుల్‌ అండ్‌ ఏరియా డెవలప్‌మెంట్‌ అథారిటీ వీటీడీఏ కార్యాలయాన్ని హైదరాబాద్‌ నుంచి వేములవాడకు మార్చేందుకు సహకరించిన మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే రమేశ్‌బాబు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్థికసాయం

కోనరావుపేట: మండలంలోని కొండాపూర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు కనకట్ల భూమయ్య కుటుంబానికి సంఘం నాయకులు ఆర్థిక సాయం అందించారు. మృతుని కుటుంబాన్ని అక్కెనపల్లి భాస్కర్‌ ఆదివారం పరామర్శించారు.